క్లుప్తంగా

నేటి నుంచి వార్షికోత్సవాలు

మైదుకూరు : పట్టణంలో వెలసిన గ్రామ దేవత పెద్దమ్మ తల్లి 25వ ప్రతిష్ఠ వార్షికోత్సవాలను బుధవారం నుంచి ఈనెల 29వ తేదీ గురువారం వరకు నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ప్రతి రోజు అమ్మవారిని విశేష అలంకారాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు అన్నారు.

23 నుంచి ప్రవచనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో చండీ తత్వంపై బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ కొత్రా శారద ప్రవచనాలు చెబుతారని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాం మోహన్‌రావు, కార్యదర్శి మునికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

24న మార్కెట్, బస్టాండ్ గేటు వేలం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో బస్టాండ్ గేటు, కూరగాయల మార్కెట్ రుసుం వసూలు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో అధిక మొత్తానికి పాట పాడిన వారు 2024 – 25 సంవత్సరానికి 12 నెలలపాటు రుసుం వసూలు చేసుకునే హక్కు కలిగి ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు కూరగాయల మార్కెట్‌కు రూ.2 లక్షలు డీడీ, తహసీల్దార్ జారీ చేసిన రూ.3 లక్షలు విలువైన సాల్వెన్సీ, బస్టాండ్ గేటుకు రూ.లక్ష డీడీ రూ.2 లక్షల విలువైన సాల్వెన్సీ పత్రాలను జత చేసి వేలం పాటకు ఒక రోజు ముందు తమ కార్యాలయంలో అందజేయాలని వివరించారు. వేలం పాట ఈనెల 24న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మైదుకూరు : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. మంగళవారం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం నెలకొల్పేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డుల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు కొత్త బోర్లను, మోటార్లను వేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వర్టులు, సీసీ రోడ్ల నిర్మాణం త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. కాగా పట్టణంలో మున్సిపాలిటీకి సంబంధించిన ఖాళీ స్థలాల్లో వ్యాపార సముదాయాలను నిర్మించాలని ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్‌కు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మహబూబ్ షరీఫ్, మూలె రేణుక పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

పోరుమామిళ్ల : ఈ నెల 18న చాపాడు సీబీఐటీలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్లకు చెందిన వారియర్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారని కోచ్ సుభాష్ తెలిపారు. మంగళవారం సుభాష్ మాట్లాడుతూ అకాడమీ నుంచి 30 మంది పోటీల్లో పాల్గొనగా 7 మంది బంగారు పతకాలు, 9 మంది రజత పతకాలు, 9 మంది కాంస్య పతకాలు సాధించారన్నారు. బంగారు పతకాలు సాధించిన వారిలో నదీష్, గురు వెంకట తేజ, మోక్షిత్, భరత్, సాయికృష్ణ తేజ, గణేష్, మౌనవర్ధన్ ఉన్నారని సుభాష్ తెలిపారు.

అవినీతి లేకుండా సంక్షేమం అందించాం

ఖాజీపేట : ఒక్క రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలను అర్హత ఉన్న లబ్ధిదారులకు అందించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనందించారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం ఖాజీపేట మండలంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు ప్రభుత్వం అందించే సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి గ్రామాలకే పాలన తీసుకువచ్చారన్నారు. సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడంలో ఎమ్మెల్యే కంటే వలంటీర్లు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీ సభ్యుల పేరిట లంచాలు తీసుకుని సంక్షేమ పథకాలు అందించడం చూశామని అన్నారు. నేడు అర్హత ఉంటే చాలు పార్టీలు, కులాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అప్పనపల్లె పంచాయతీలో 2019 ఎన్నికల్లో టీడీపీకి 300 మెజార్టీ వచ్చినా నేడు ఇదే పంచాయతీకి రూ.40 కోట్లు సంక్షేమ లబ్ధిని చేకూర్చామని గుర్తు చేశారు. మాకు పార్టీలతో సంబంధం లేదని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని టీడీపీ వారే అంటున్నారని తెలియపరిచారు. పథకాలు కావాలన్న, అభివృద్ధి జరగాలన్న సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవడం మన బాధ్యత అన్నారు. అనంతరం సేవా వజ్రకు ఎంపికైన చంద్రకళ, భాగ్యలక్ష్మి, సేవా రత్నకు ఎంపికైన వెంకటరమణ, షేక్ సురయా బేగం, సుబ్బలక్ష్మమ్మ, అరుణ కుమారి, షేక్ షాహినీలకు ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా, మైదుకూరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు బి.శ్రీనివాసులు, రాముడు, కె.సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, బుజ్జి, కె.సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు వలంటీర్లు పాల్గొన్నారు.


ఖాజీపేటలో వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


ప్రొద్దుటూరులో వెంకటమనీషాకు సేవా వజ్ర అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


నరసాపురంలో వలంటీర్లకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

దువ్వూరు : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుగుణశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలంలోని 252 మంది వలంటీర్లకు సేవా మిత్ర, 5 మందికి సేవా రత్న, ఇద్దరికి సేవా వజ్ర కింద అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు కోగటం వీరారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సానేపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, సంగన హరినాథరెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తే ఈ వలంటీర్లు ఉండరు

ప్రొద్దుటూరు : చంద్రబాబు నాయుడుతోపాటు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లపై పలు రకాల విమర్శలు చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తే ఇప్పుడున్న వలంటీర్లను తొలగించి, వారికి అనుకూలమైన వారిని నియమించుకునే అవకాశం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో 93 వేల ఇళ్లకు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు సేవలు అందించడం కష్టమన్నారు. ఈ కారణంగానే 1560 మంది వలంటీర్లను నియోజకవర్గంలో నియమించామన్నారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్ వెళ్లి ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. పిట్ట కొంచం, కూత ఘనమని పేరుకు వలంటీర్‌గా ఉన్నా నాయకులకంటే వలంటీర్లకే ప్రజాదరణ ఎక్కువగా ఉందన్నారు. వలంటీర్లకు వేతనం పెంచాలని రెండో మారు జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తాను అసెంబ్లీలో చర్చిస్తానన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇద్దరూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి, వలంటీర్లకు ఉమ్మడి శత్రువులని తెలిపారు. చౌడూరు గ్రామానికి చెందిన వెంకటమనీష సేవా వజ్ర, పెద్దశెట్టిపల్లె రెండో సచివాలయంలో పనిచేస్తున్న వలంటీర్ శేఖర్‌రెడ్డి, చౌటపల్లె సచివాలయంలో పనిచేస్తున్న సునీత స్వర్ణ, కొత్తపల్లె 5వ సచివాలయంలో పనిచేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి, 2వ సచివాలయంలో పనిచేస్తున్న బెస్త హైమావతి, నంగనూరుపల్లె సచివాలయంలో పనిచేస్తున్న షావలి అశోక్ చక్రవర్తికి సేవా రత్న అవార్డులు ఇవ్వగా, మిగతా వారందరికీ సేవా మిత్ర అవార్డులను అందించారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద, వైస్ ఎంపీపీలు ఆసం దస్తగిరిరెడ్డి, ఇంజేటి రెడ్డమ్మతోపాటు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం

కాశినాయన/ కలసపాడు : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మంగళవారం నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో, కలసపాడులోని ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చామన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు సైనికుల్లా పనిచేసి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో వలంటీర్లు బాగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతిభ చూపిన వలంటీర్లను గుర్తించిన ప్రభుత్వం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పేర్లతో సత్కరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లపై పెట్టుకున్న నమ్మకాలను వమ్ము చేయకుండా మరింత కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం ఇద్దరికి సేవావజ్ర, 5 మందికి సేవారత్న, 158 మందికి సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు క్రిష్ణ, డీటీ లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.గురివిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

కలసపాడులో..

మండలంలో 175 మంది వలంటీర్లు పనిచేస్తున్నారని, వారిలో ఇద్దరికి సేవావజ్ర, 5 మందికి సేవారత్న, 168 మందికి సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. సేవావజ్ర కింద రూ.45 వేలు, సేవారత్నకు రూ.30 వేలు, సేవామిత్రకు రూ.15 వేలు నగదును వారి ఖాతాల్లో జమ చేస్తారన్నారు. నియోజకవర్గంలో కలసపాడు మండలానికి రెండు సేవావజ్ర పురస్కారాలు రావడం అభినందనీయమన్నారు. కొన్ని పత్రికల్లో వలంటీర్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని మీరు తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, నాయకులు అంకనగురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, నారాయణయాదవ్, దేవసానిశ్రీనివాసులరెడ్డి, పులివీరారెడ్డి, సింగరయ్య, గురయ్య, తహసీల్దారు, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ఆ రూ.18 లక్షలు ఏమయ్యాయి?

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నుండి 11-11-2022 నుండి 17-11-2023 తేదీ వరకు దేవదాయ శాఖ అధికారులు డ్రా చేసిన రూ.18.68 లక్షలు ఏమయ్యాయని ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి ఇప్పటికే అనేక మార్లు సంబంధిత అధికారిని నిలదీశారు. పాలక మండలికి తెలియకుండా డ్రా చేసిన డబ్బును దేని కోసం ఉపయోగించారో సమాధానం చెప్పలేదని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా పాలక మండలికి తెలియకుండా ఈఓ శివయ్య సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, గతేడాది నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూ.9 లక్షలకు పైగా హుండీ ఆదాయం రాగా రూ.8 లక్షలు మాత్రమే వచ్చినట్లు ఈఓ ప్రకటించడం, మిగిలిన డబ్బులు ఏమయ్యాయో తెలపలేదన్నారు. అంతేకాకుండా బ్రహ్మోత్సవాలకు సంబంధించి తలనీలాల సేకరణకు నిర్వహించే వేలం సమాచారం కూడా ఇవ్వలేదని తెలిపారు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదిన సందర్భంగా మూడు రోజుల పాటు మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దేవదాయశాఖ, పాలక మండలి సమన్వయంతో ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. వచ్చిన భక్తులు వివిధ కానుకల రూపంలో హుండీలో సమర్పించుకుంటారు. ప్రతి ఏటా హుండీ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుంది. గతంలో ఈఓగా పనిచేసిన ఓ అధికారి హుండీ ఆదాయం లెక్కింపులో చేతివాటం ప్రదర్శించి చివరికి సస్పెన్షన్‌కు గురయ్యారు. కాగా మల్లెంకొండేశ్వరస్వామి ఖాతా నుండి డ్రా చేసిన రూ.18.68 లక్షలు కూడా భక్తుల ద్వారా వచ్చినవే. వచ్చిన డబ్బును కొండపైన అభివృద్ధికి గాని బ్రహ్మోత్సవాల సమయంలో సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. కానీ డ్రా చేసిన డబ్బుకు సంబంధించి ఇప్పటి వరకు పాలక మండలి చైర్మన్‌కు లెక్క చూపకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని లెక్కచూపని రూ.18 లక్షలకు సంబంధించి విచారణ జరిపి భక్తుల్లో నెలకొన్న అపనమ్మకాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని చైతన్య ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ గాంధీ పార్కులో మంగళవారం సాయంత్రం ఎయిడ్స్‌పై వీధి నాటక రూపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత సూదులు, సిరంజీల ద్వారా, కలుషిత రక్తమార్పిడి ద్వారా ఎయిడ్స్ వ్యాపిస్తుందని వారు చెప్పారు. అలాగే హెచ్‌ఐవీ వచ్చినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, హెచ్‌ఐవీ ఉన్న గర్భిణీల నుంచి పుట్టబోయే బిడ్డలకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్య సొసైటీ సిబ్బంది పుల్లయ్య, ప్రతిమ, భాగ్యలక్ష్మి, ఉమా మహేశ్వర్, సునీత, వంశీ, పీర్ పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయం నిర్మించే బాధ్యత నాదే

ప్రొద్దుటూరు : కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని అమృతానగర్‌లోని 27వ వీధిలో ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు అవసరమవుతాయని స్థానికులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10లక్షలు వెచ్చించి ఈ ఆలయాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని తెలిపారు. కల్లూరు నాగేంద్రారెడ్డి, బండారు సూర్యనారాయణలకు ఈ బాధ్యత అప్పజెప్పుతున్నానన్నారు. నందవరంలో చౌడేశ్వరి ఆలయ నిర్మాణానికి రూ.2కోట్లు ఇస్తానని తాను ఇదివరకే ప్రకటించానని ఎమ్మెల్యే తెలిపారు. శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ క్రియేషన్స్ వ్యవస్థాపకుడు కంభం పాములేటి, రాయపురెడ్డి, పగిడాల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : నిరాశ్రయుల సంరక్షణను సెంటర్ నిర్వాహకులు బాధ్యతగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. వరల్డ్‌డే ఆఫ్ సోషల్ జస్టిస్ సందర్భంగా మంగళవారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతిగృహాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాశ్రయులను ఆదరించడం సామాజిక సేవ అని, నిరాశ్రయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిరాశ్రయుల వసతిగృహంలో ఉన్న వృద్ధులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిరాశ్రయుల వసతిగృహం నిర్వాహకులు రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

నేడు బి.మఠంలో వలంటీర్లకు వందనం

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని విశ్వబ్రాహ్మణ అన్న సత్రంలో బుధవారం సాయంత్రం 3గంటలకు గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరిస్తారన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రషీద్ ఖాన్


రషీద్ ఖాన్

ప్రొద్దుటూరు : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ ఏపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రొద్దుటూరుకు చెందిన పి.రషీద్ ఖాన్‌ను నియమించారు. భీమవరంలో జరిగిన 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఈయనను ఎన్నుకోవడం జరిగింది. రాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో రషీద్ ఖాన్ ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులోని యూనియన్ కార్యాలయంలో రషీద్ ఖాన్‌ను అభినందించారు.

పోరుమామిళ్ల: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పి. రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ సంఘం రీజనల్ కన్వీనర్ క్రిష్టారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శని, ఆది వారాల్లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో రమణారెడ్డిని ఎన్నుకున్నారన్నారు.



సావిశెట్టిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లెలో మదర్‌థెరిసా ఫౌండేషన్, బ్రెయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్తారవిప్రకాష్‌రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వరప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటికే వైద్య సేవలు

ప్రొద్దుటూరు క్రైం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటి ముంగిటికే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న దొరసానిపల్లె గురూజీ స్కూల్ వద్ద మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు సుదేష్ణ, హిమబిందు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రతాపరెడ్డిలు వైద్య సేవలు అందించారు. సుమారు 388 మంది వివిధ రకాల వ్యాధులకు చికిత్సలు చేయించుకున్నారు. డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రెడ్డి, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నక్కలదిన్నె పీహెచ్‌సీ ప్రారంభం నేడు

చాపాడు : మండలంలోని నక్కలదిన్నెలో రూ.2.48 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. 1.12 ఎకరాల్లో నిర్మించిన పీహెచ్‌సీ నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామిడ్డి సమీప బంధువు, నక్కలదిన్నె గ్రామానికి చెందిన పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి స్థలాన్ని ఇచ్చారు. అధునాతన విధానంలో నిర్మించిన పీహెచ్‌సీని బుధవారం ఉదయం 9:30గంటలకు ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, స్థలదాత, జేసీ రాంసుందర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ నాగరాజు, ఆర్ అండ్ బీ అధికారులు హాజరుకానున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే చుట్టు పక్కల 24 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేత

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్ విద్యార్థినులకు మంగళవారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రి అందజేశారు. . 108 మంది బాలికలకు పదివేల రూపాయల విలువైన పరీక్షా సామగ్రిని తాడిపత్రికి చెందిన హెచ్‌పి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఓబులేసు అందించారని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ చిరంజీవి చేతుల మీదుగా విద్యార్థినిలకు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారుడు రాజోలి శ్రీధర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి జయరాం తదితరులు పాల్గొన్నారు.







